నీలగిరి సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- రూ.96 కోట్లతో తాగునీటి శుద్ధి కేంద్రం
- రోజుకు 70ఎంఎల్‌డీ తాగునీటి సరఫరా
- పాలకవర్గ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చెర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో వైస్ చైర్మన్, కమిషనర్

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెస్తున్నామని పేర్కొన్నారు. రూ.216కోట్లతో పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రస్తుతం 11వార్డుల్లో సాగుతున్నాయని తెలిపారు. క్రమపద్ధతిలో అన్ని వార్డుల్లో యూజీడీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. సీసీ రోడ్లు వేసిన తర్వాత అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడితే మళ్లీ రోడ్లు తవ్వితే పాడవుతాయని, అందుకే ముందుగా యూజీడీ పనులు చేస్తున్నట్లు వివరించారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా నీలగిరి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

పట్టణంలోని పలు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, రూ. 96 కోట్లతో తాగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 70 ఎంఎల్‌డీ తాగునీటిని ప్రతి రోజు సరఫరా చేస్తామని తెలిపారు. ముందుగా విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అందులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కాగా, టీయూఎఫ్ఐడీసీ పనులు అన్ని వార్డుల్లో ఒకే సారి ప్రారంభించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దాంతో కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య స్వల్ప వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌లు జోక్యం చేసుకొని వ్యక్తి గత ఆరోపణలు చేయడం సరాకాదన్నారు. 58 నెలల నుంచి చప్పుడు చేయకుండా ఉండి మరో రెండు నెలల్లో పాలకవర్గ గడువు ముగిసే సమయంలో రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. పార్టీలు చూడకుండా అన్ని వార్డులకు నిధులు కేటాయించి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వార్డుల్లో ఉన్న సమస్యను తమ దృష్టికి తెస్తే పరిష్కరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ నిధులు పాలకవర్గ అనుమతి లేకుండా దారి మళ్లించినా ఒక్కరు నోరు మెదపకుండా ఇప్పుడు రాజకీయాల విమర్శలు చేయడం సరైందికాదన్నారు. సమావేశంలో మున్సి పల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఫ్లోర్ లీడర్‌లు బండారు ప్రసాద్, అభిమన్యు శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

ప్రెస్‌క్లబ్‌కు సంపూర్ణ సహకారం అందిస్తా

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ ప్రెస్‌క్లబ్‌కు సంపూర్ణ సహకారం అందిస్తానని, జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం శుక్రవారం గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత ప్రెస్‌క్లబ్ భవనం ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం పలు మార్గాలను అన్వేషిస్తుందని తెలిపారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఝరేడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ఇతర బాధ్యులు దోసపాటి సత్యనారాయణ, మాదురి యాదగిరి, మదనాచారి, సయ్యద్, పిట్టల రామకృష్ణ, కంది భజరంగ్‌ప్రసాద్, చాంద్, ఉయ్యాల లింగయ్యగౌడ్, ఉపేందర్, కంది శ్రీనివాస్, ప్రసాద్, ఉపేందర్, మల్లేష్, రవీందర్ రెడ్డి, భాస్కర్, రాంప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 24మంది పేదలకు సహాయ నిధి కింద మంజూరు చేయించిన రూ. 8.15లక్షల విలు వ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజితారెడ్డి, నాయకులు నాగులవంచ వెంకటేశ్వరావు, దుబ్బ అశోక్‌కుమార్, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, శ్రీరామదాసు హరికృష్ణ, చిలకరాజు శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రోజు విధిగా మెనూ పాటించాలి

- చండూరు ఆర్డీఓ శ్రీదేవి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న చండూరు ఆర్డీఓ శ్రీదేవి

మునుగోడు: ప్రభుత్వ హాస్టల్, గురుకుల పాఠశాలల్లో ప్రతి రోజు విధిగా మెనూ పాటించాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మునుగోడులోని కస్తూరిబా పాఠశాలని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థులకు వండిపెట్టిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వండిపెడుతున్న భోజనంలో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా రుచిగా వండి పెట్టాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయ భాస్కర్, పాఠశాల ప్రత్యేక అధికారి, ఆర్ఐలు ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

నకిరేకల్ : విద్యార్థుల సమస్యలపై హైదరాబాద్‌లో జరిగే నిరసన కార్యక్రమం సందర్భంగా నకిరేకల్‌లో బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శుక్రవారం తెల్లవారుజామునే నకిరేకల్‌లోని పలువురు బీజేపీ నాయకులు ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్, నాయకులు గుడుగుంట్ల సాయన్న, కాడింగు నాగరాజు, చనగాని రాములు, నాగయ్య, పందాల సైదులు, బ్రహ్మదేవర రవి శంకర్, జానీ ఉన్నారు.

మునుగోడు: బీజేపీ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్లేందుకు సిద్ధమైన ఆ పార్టీ నాయకులను మునుగోడు పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, నాయకులు బొడ్డు నాగరాజు గౌడ్, మాదగోని నరేందర్ గౌడ్, పందుల యాదయ్య, ఏర్పుల నగేష్, మేకల మహేష్, లక్ష్మణ్ ఉన్నారు.

చిట్యాల: గురుకుల విద్యార్థుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా చిట్యాలలోని పలువురు ఆ పార్టీ నాయకులను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విద్యార్థుల సమస్యలపై నిరసన తెలుపకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని బీజేపీ జిల్లా నాయకుడు చికిలంమెట్ల అశోక్ ఖండించారు. అనంతరం వ్యక్తి గత పూచీకత్తుపై విడుదల చేశారు.

రైతులకు సాగునీరు అందించేందుకు కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లిలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నార్కట్‌పల్లి : రైతులకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని ఉదయ సముద్రం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఉమేష్, సీఐ నాగరాజు, బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, జేరిపోతుల భరత్, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధగోని స్వామి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చిట్యాల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా 85 మందికి మంజూరైన రూ.25లక్షల విలువ గల చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణానాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కాటం వెంకటేశం, పోకల దేవదాసు, లక్ష్మీనర్సింహ ఉన్నారు.

రేపు మాలల 'సింహగర్జన'

నల్లగొండ టౌన్ : సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ గోలి సైదులు తెలిపారు. శుక్రవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్‌లు రేకల సైదులు, బోగరి విజయ్‌కుమార్, తెలగమల్ల యాదగిరి, గాలిరవి, కిషన్, రవ్వ యాదగిరి, మేకల కృష్ణయ్య, రవి పాల్గొన్నారు.

'సింహగర్జన సభ' పోస్టర్ ఆవిష్కరణ

కేతేపల్లి: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహిస్తున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌లను మండలంలోని తుంగతుర్తి గ్రామంలో శుక్రవారం ఆసంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మెరుగుమళ్ల భిక్షం, గాదరి జంపన్న, ముక్కంటి, వీరయ్య పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా సంబరాలా?

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాదగోని శ్రీనివాస్‌గౌడ్

తిప్పర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజాపాలన పేరిట సంబరాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన లేదని ప్రతి కాంగ్రెస్ నాయకుడు దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నూకల వెంకట్‌నారాయణరెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, పల్లేప్రకాశ్, మధు, మైనం మల్లయ్య, వంగూరి రవి, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

'చారుమతి'కి నిత్యావసర సరుకులు అందజేత



సరుకులతో నారాయణ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లగొండ : పట్టణంలోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ విద్యార్థులకు శుక్రవారం నారాయణ స్కూల్ విద్యార్థులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దివ్య మాట్లాడుతూ పేద పిల్లలకి తమ పాఠశాల విద్యార్థులు ఏదో విధంగా సహాయం చేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది నారాయణ విద్యాసంస్థల్లో సంవత్సరంలో ఒకరోజు ఇలాంటి కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నామని, అందులో భాగంగానే సరుకులు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ విజయ్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ అఫ్రీన్, ప్రత్యూష దివ్య, ఏఓ తరుణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమాన వేతనం ఇవ్వాలని నల్లబ్యాడ్జీలతో నిరసన



చండూరు : కేజీబీవీ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చండూరు : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చిల్డ్రన్ కేర్ టేకర్లను నియమించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామలింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చండూరు కేజీబీవీ ఎదుట విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నాంపల్లి సైదులు, మమత, విద్యాలయం ప్రత్యేక అధికారి మంజుల, ఉపాధ్యాయులు సంతోష, ఎలిజబెత్, ప్రవీణ, శ్వేత పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బిల్లులు చెల్లించాలని ధర్నా



చిట్యాలలో ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చిట్యాలలో ఎంఈఓ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆవుల అనసూయ, మేడి హంస, నోముల విజయ, గోలి అరుణ, జోగు పార్వతమ్మ, చేగూరి కవిత, మేడి శ్రీలత, కళమ్మ, పుష్పలత, అండాలు, శోభ పాల్గొన్నారు.

గొల్లకురుమలను మోసం చేసిన బీఆర్ఎస్

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



గొల్లకురుమలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాంపల్లి : గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్లకురుమలను మోసగించిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని దేవత్‌పల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మునుగోడు ఉపఎన్నికల ముందు గొల్లకురుమలకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామని రూ.లక్షలు బ్యాంకుల్లో డిపాజిట్ చేయించుకుందని తెలిపారు. యూనిట్లను పంపిణీ చేయకపోగా వారి ఖాతాలను ఫ్రీజ్ చేయించి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. త్వరలో కలెక్టర్‌తో మాట్లాడి గొల్లకురుమలతో పాటు రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, ఏవీరెడ్డి, సుధకర్, పగిళ్ల వెంకటయ్య, సతీష్ ఉన్నారు.

శాలిగౌరారంలో ఘనంగా రైతు పండుగ



ఉత్సవాలలో పాల్గొన్న అధికారులు, రైతులు

శాలిగౌరారం: ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా పీఏసీఎస్, వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం రైతుపండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పాలనను అందిస్తోందన్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతు పండుగకు తరలిరావాలి

నల్లగొండ రూరల్ : రైతు పండుగకు రైతులు తరలిరావాలని పీఏసీఎస్ గొల్లగూడ సొసైటీ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రైతు పండుగ మహాసభకు రైతులు తరలి రావాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి అనంత రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

కేతేపల్లి: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం కేతేపల్లిలో పీఏసీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ దీక్షా దివస్



నల్లగొండలో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, భగత్, నాయకులు, శ్రేణులు



కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ఫొటో ఫ్లెక్సీని సభలో ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్త



నల్లగొండలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ దీక్షా దివస్ సభకు హాజరైన కార్యకర్తలు, చిత్రంలో కేసీఆర్ దీక్షల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న శ్రేణులు



తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, శ్రేణులు

క్లుప్తంగా

ఘనంగా మాస కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పారిశ్రామిక వేత్త కందాల శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఉప్పలరమేష్, ఆలయ ధర్మకర్తలు కందాల ప్రవీణ, రవిచంద్ర, బొప్పని యాదగిరి, ఆలయ మాజీ చైర్మన్ కొండ జానయ్యగౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

నకిరేకల్ : విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్ కోరారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధిలో ఉన్న బాలిక ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థుల, చిన్నారులతో మాట్లాడారు. ప్రభుత్వం విద్యా కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

నకిరేకల్ : నకిరేకల్‌లోని డాక్టర్స్‌కాలనీలో గల శ్రీ వాసవీ కన్యాక పరమేశ్వరి దేవాలయంలో కొలువై ఉన్న మరకత పంచలింగేశ్వర స్వామికి పంచమేఖేశ్వర స్వామి వారికి శుక్రవారం సాముహిక మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోబ్రహ్మదేవర పద్మాక్రిష్ణమూర్తి, బ్రహ్మదేవర లక్ష్మయ్య, బ్రహ్మదేవర రాంమోహన్, వీర్లపాటి నర్సింహారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కట్టంగూర్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఎంఈఓ అంబటి అంజయ్యకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో మాచర్ల యాదమ్మ, కొప్పు మంగమ్మ, నాగమ్మ, కళమ్మ, మైసమ్మ, యాదమ్మ, విజయమ్మ ఉన్నారు.

కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణం తులసీనగర్ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అదే విధంగా ఉదయం భక్తులు స్వామి వారికి రుద్రాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కళాశిక కుశలయ్య, సిబ్బంది శేఖర్, గోదాదేవి, శ్రీను, భక్తులు శ్రీనివాస్, జగన్, ప్రవీణ్, భవాని, ఉమా పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు విజయోత్సవాలు

తిప్పర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా శనివారం నుంచి రైతు విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిప్పర్తి పీఏసీఎస్ ద్వారా 588మంది రైతులకు రూ.3.69కోట్లు రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌లో సుమారు 50వేల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేసి రూ.పది కోట్లు రైతుల ఖాతాలో జమచేశామని తెలి పారు.కార్యక్రమంలో కార్యాలయ సీఈఓ భిక్షమయ్య, డైరెక్టర్ జానయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

మర్రిగూడ : మండలంలోని పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని జైభీమ్ కమిటీ జిల్లా కోకన్వీనర్ ఎస్‌వై.గిరి అన్నారు. జైభీమ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దార్ తారకరామన్‌కు వినతిపత్రం అందచేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వినోద్, సుధాకర్, జగన్, గిరి, సురేష్, రాజు, రమేష్, నరసింహా, సుమన్ పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేత

నకిరేకల్ : నకిరేకల్ మండలం తాటికల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లోని గ్రంథాలయానికి నకిరేకల్‌కు చెందిన కవి రచయిత పల్స వెంకటేశ్వర్లుగౌడ్ శుక్రవారం రూ.3వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఆపాఠశాల హెచ్‌ఎం ప్రజ్ఞాపురం వెంకన్న, ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మర్రిగూడ : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల గడువు వచ్చే నెల 11 వరకు పొడిగిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కళా శ్రీనివాస్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పి.కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 11వ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వేతనాలు చెల్లించకపోతే ఆందోళన తప్పదు

నల్లగొండ టౌన్ : మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆందోళన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఎస్ఈ డి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎండి.జాని, బత్తుల వెంకటేశం, దయాకర్, నిమ్మనగోటి శ్రీను, పాక శ్రీను, విజయ్‌కుమార్, నాగరాజు, రామకృష్ణ, రవి, సైదులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

నల్లగొండ రూరల్ : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్, రన్నింగ్, క్యారం పోటీల్లో అవంతిపురం బధిరుల ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు దివ్యాంగులు ప్రతిభ కనబర్చారు. వారికి శుక్రవారం ఐసీడీఎస్ పీడీ శైలజ బహుమతులు అందజేసి అభినందించారు.

సీపీఎం బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

కట్టంగూర్ : మిర్యాలగూడలో డిసెంబర్ 2న నిర్వహించే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చెరువుఅన్నారం గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి ఆయన బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. . కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు చిలుముల రామస్వామి, గడగోజు రవింద్రాచారి, గంట వెంకన్న, గద్దపాటి సుధాకర్, కక్కిరేణి రామస్వామి, రెడ్డిమల్ల భిక్షం, నంద్యాల రాంరెడ్డి, గద్దపాటి దశరథ ఉన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం

నాంపల్లి: విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శేఖర్ విమర్శించారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అవస్థలు పడుతుంటే ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందన్నారు. కార్యక్రమంలో నవదీప్, విశ్వతేజ, కుమారస్వామి, జైపాల్, నితిన్, మల్లికార్జున్, ఉన్నారు.

రమేశ్‌ను కోర్టులో హాజరుపరుచాలి

శాలిగౌరారం: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రికొత్తగూడెం జిల్లా కార్యదర్శి పూనెం రమేశ్‌కు హానీ తలపెట్టకుండా పోలీసులు కోర్టులో హాజరుపరుచాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రమేశ్‌ను కోర్టులో హాజరు పరిచేవరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.